సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

హైస్కూల్ స్థలం ధారాదత్తం..!

- చిట్టివలస జ్యూట్ కార్మికుల త్యాగానికి వెలకట్టిన తెరవెనుక శక్తులు
- స్థలాన్ని సంరక్షించుకుంటామంటున్న పూర్వ విద్యార్థులు



పాత ప్రహరీ నుంచి ఎనిమిది అడుగుల స్థలం వదిలి కొత్తగా గోడ నిర్మాణానికి మార్కింగ్



ఇంటి నిర్మాణానికి పాత ప్రహరీని కూల్చిన దృశ్యం



జెడ్పీ హైస్కూల్ స్థలం వద్ద పూర్వ విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస హైస్కూల్ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు తెరవెనుక కొందరు తీవ్రంగా యత్నిస్తున్నారు. పూర్వ విద్యార్థులు సోమవారం అడ్డుపడడంతో వారి ప్రయత్నాలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. వివరాల్లోకి వెళ్తే... చిట్టివలస జ్యూట్ కార్మికులు ఒక్కరోజు వేతనం రూ.18 చొప్పున కేటాయించి జెడ్పీ హైస్కూల్‌కు 1972లో నాలుగు ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి ఇచ్చారు. ఆ స్థలంలో ముందుగా చిట్టివలస జెడ్పీ హైస్కూల్, తర్వాత జెడ్పీ బాలికల హైస్కూల్, ఇటీవల రూ.2 కోట్లతో కళాశాల వసతి గృహం నిర్మించారు. ఇప్పుడు అదే ఆవరణలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కూడా నిర్వహిస్తున్నారు. మిగిలిన ఆటస్థలంలో పూర్వ విద్యార్థులు రోజూ క్రీడా సాధన, వ్యాయామం చేస్తూ ఉద్యోగాలకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు ఈ హైస్కూల్‌లో మిగిలిన ఆటస్థలం మీద ప్రైవేటు వ్యక్తుల కన్నుపడింది. వారు కొందరిని మచ్చిక చేసుకుని జ్యూట్ కార్మికుల త్యాగానికి రేటు కట్టి కొట్టేసేందుకు యత్నిస్తున్నారు. ఇందులో భాగంగా స్కూల్ స్థలం ఆగ్నేయంలో పాత ప్రహరీ దగ్గర నుంచి ఎనిమిది అడుగులు మినహాయించి కొత్తగా ప్రహరీ నిర్మాణానికి దివీస్ లేబొరేటరీని రంగంలోకి దించారు. దీంతో విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం అక్కడకు చేరుకుని ఆందోళనకి దిగారు. స్కూల్ స్థలం ఇప్పటికే 23 సెంట్లు ఆక్రమణకు గురైందని, ఆ వివరాలు ఆర్‌సీ 2/1 డాక్యుమెంట్‌లో ఉన్నాయన్నారు. ప్రైవేటు వ్యక్తుల కోసం స్థలం విడిచిపెట్టి ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకోవడంతోపాటు ఇప్పటికే ఆక్రమణకు గురైన 23 సెంట్ల స్థలాన్ని కూడా స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్‌ను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

రహదారి పేరుతో కొత్త నాటకానికి తెర..

అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టు స్కూల్ చుట్టూ ఉన్న అపార్ట్‌మెంట్ల యజమానులకు స్కూల్ ఆవరణ నుంచి రహదారి ఇవ్వడానికి కొందరు బయలుదేరారు. వారితో ఇప్పటికే బేరసారాలు ముగించుకుని కొంత సొమ్ము లాగించినట్టు పూర్వ విద్యార్థులు గట్టిగా ఆరోపిస్తున్నారు. ఇటీవల స్కూల్ ప్రహరీకి ఆనుకుని ప్రైవేట్ వ్యక్తులు మెటీరియల్ తీసుకుపోవడానికి పాత ప్రహరీ కూల్చివేసినా ఇక్కడి ప్రజాప్రతినిధులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ, ఉపాధ్యాయులు అడ్డు చెప్పలేదు. కూల్చిన గోడను ఇప్పటికీ పునరుద్ధరించలేదు. ఇప్పుడు ఏకంగా ఎనిమిది అడుగుల వెడల్పు, 150 మీటర్ల పొడవు ఉన్న స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు నిస్సిగ్గుగా వదిలేశారు. దీంతో పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమయ్యారు.

గతంలో నిర్మించిన ప్రహరీని యథాస్థానంలో పునరుద్ధరించాలని, లేదంటే నిర్మాణం చేపట్టవద్దని దివీస్ యాజమాన్యాన్ని హెచ్చరించడంతో వారు వెనుదిరిగారు. ఇప్పటికే తగరపువలస, చిట్టివలసలో ఆటస్థలాలు లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతుంటే ఉన్న స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే చర్యలు అడ్డుకుంటామన్నారు. కార్మికుల త్యాగంతో కొనుగోలు చేసిన స్థలాన్ని కార్మిక సంఘాలతో కలిసి పూర్వ విద్యార్థులందరం రక్షించుకుంటామంటున్నారు. గతంలో కబ్జాకు గురైన 23 సెంట్ల స్థలాన్ని కూడా సర్వే చేసి కాపాడాలని కోరుతున్నారు.

దంచికొట్టిన వర్షం



శిల్పారామంలో నిలిచిన వాన నీరు

తగరపువలస: పగలంతా ఎండవేడిమితో విసిగిపోయిన భీమిలి ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. రెండు గంటలపాటు కురిసిన వర్షాలకు డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. అకాల వర్షం కారణంగా రబీలో సాగులో ఉన్న పంటలకు మేలు జరిగిందని భీమిలి డివిజన్ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వరుస ఎండలతో వడలిపోయిన వరి, కూరగాయలు, పువ్వుల పంటలకు వర్షం మేలు చేసింది. ఇదిలా ఉండగా వరస వర్షాలతో భీమిలి మండలం మూలకుద్దు పంచాయతీలో ఉప్పు సాగు రైతులు ఆర్థికంగా నష్టపోయారు.

పీఎం పాలెం /మధురవాడ : హఠాత్తుగా కురిసిన వర్షం కారణంగా బస్టాపుల్లో ఉన్న విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మధురవాడ అప్ బ్రిడ్జితోపాటు లోతట్టు ప్రాంతాలు, పీఎం పాలెం రత్నగిరి హౌసింగ్ బోర్డు కాలనీలో రహదారులు జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో స్థానికులు అంధకారంలో ఇబ్బందిపడ్డారు.

క్లుప్తంగా

శివయ్యకు ప్రత్యేక పూజలు



రామాద్రిలో పూజలు అందుకున్న శివలింగం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట రామాద్రి శివాలయంలో, ఎండాడ శివాలయంలో సోమవారం మాస శివరాత్రి సందర్భంగా శివయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ముందుగా స్వామిని పువ్వులతో అలంకరించారు.

ఉగాది, శ్రీరామనవమి ఏర్పాట్ల పరిశీలన



వారీజా ఆశ్రమంలో అహోబిల జీయర్ స్వామి, తదితరులు

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు మంగమారిపేట వారీజా ఆశ్రమంలో వైభవంగా నిర్వహించనున్న ఉగాది, శ్రీరామనవమి ఏర్పాట్లను అహోబిల జీయర్ స్వామి సోమవారం పర్యవేక్షించారు. ముందుగా భక్తులకు తీర్థగోష్టి నిర్వహించారు. వారీజా ఆశ్రమంలో ఈ నెల 22వ తేదీ నుంచి 30 వరకు వసంత నవరాత్రుల్లో భాగంగా రోజూ ఉదయం 8 నుంచి 9గంటల వరకు సుందరాకాండ పారాయణ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు పరీక్షా మెటీరియల్ అందిస్తున్న మాజీ సర్పంచ్ రాజేశ్వరి

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో 83 మంది పదో తరగతి విద్యార్థులకు మాజీ సర్పంచ్ పల్లంటి రాజేశ్వరి సోమవారం పరీక్షా మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆరేళ్లుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పరీక్షా మెటీరియల్ అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో శ్యామసుందరరావు, ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ సరగడ రవి, ఉపాధ్యాయులు టి.ఎస్.వి.ప్రసాదరావు, స్థానిక నాయకులు ఉండబట్ల చిన్నారావు, మద్దిల గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

హమాలీల నిరశన

పద్మనాభం: తమ సమస్యలు పరిష్కరించాలని హమాలీలు కృష్ణాపురంలోని మండల సివిల్ సప్లై గిడ్డంగి వద్ద సోమవారం నిరశన చేపట్టారు. ఈ సందర్భంగా 13 నెలల ఎరియర్స్ తక్షణమే చెల్లించాలని, మూడు జతల దుస్తులు, కుట్టు కూలి ఇవ్వాలని, పీఎఫ్ సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు.

పురుగు మందు తాగి వృద్ధురాలి మృతి

పద్మనాభం: మండలంలోని కొత్త కొవ్వాడకు చెందిన లగుడు సూరీడమ్మ (65) సోమవారం ఉదయం పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె కుమారుడు సూర్యనారాయణ పద్మనాభం పోలీసులకు అందించిన సమాచారం ప్రకారం... సూరీడమ్మ కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయింది. ఈ క్రమంలో మామిడిచెట్లకు కొట్టే పురుగుల మందు సోమవారం తాగడంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

70 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆనందపురం : మండలంలోని కణమాంలో సోమవారం కుటుంబ డాక్టర్ వైద్య విధానంలో వైద్యులు ఉచిత పరీక్షలు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ఆబోతు అప్పలరాము శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ హరీష్ వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సేవల్లో భాగంగా 14 రకాల పరీక్షలు నిర్వహించి, 67 రకాల మందులు అందజేస్తున్నామని వివరించారు. బాలింతలు, మధుమేహం ఉన్నవారికి, గర్భిణులకు ఈసీజీ పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఇంటి వద్ద ఉన్న రోగులను పరామర్శించి వైద్య సలహాలు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య సలహాలు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు టి.కల్యాణమ్మ, పి.సన్యాసిరావు, సీహెచ్‌వో శ్యామ్, ఆరోగ్య కార్యకర్తలు రాములమ్మ, తారకేష్ తదితరులు పాల్గొన్నారు,.

శక్తి ఉత్పాదనలో అణువిద్యుత్ ప్రత్యామ్నాయం



విద్యార్థులు తయారు చేసిన వాహనాలు పరిశీలిస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత రవి.బి.గ్రోవర్

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సాంకేతిక యువజనోత్సవం, సంఘర్ష్ - 6.0 సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవాలను అణు శాస్త్రవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత రవి.బి.గ్రోవర్ ప్రారంభించారు. దేశంలో శక్తి ఉత్పాదన రంగంలో అణువిద్యుత్ అసలైన ప్రత్యామ్నాయం అని ఆయన అన్నారు. దేశ ప్రగతితోపాటు విద్యుత్ అవసరాలు పెరుగుతున్నాయన్నారు. సాంప్రదాయేతర ఇంధన వనరులను ప్రత్యామ్నాయంగా పేర్కొంటున్నప్పటికీ వాటి ద్వారా విద్యుత్ ఉత్పాదనకు వ్యయం అధికంగా అవుతుందన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన రోబో నమూనాలు, స్వయంగా తయారు చేసిన వాహనాలు ఆయన పరిశీలించారు.

మే 12న అనంతుని చందనోత్సవం



ఎంపీపీ రాంబాబు, లక్ష్మణరావును సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయం, గిరిపై వెలసిన అనంత పద్మనాభునికి చందోనోత్సవం నిర్వహించనున్నట్టు ఎంపీపీ కంటుబోతు రాంబాబు తెలిపారు. అనంతుని కల్యాణోత్సవాలు విజయవంతం కావడంతో ఉత్సవ కమిటీ సభ్యులు కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఎంపీపీ రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావును సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ మే 12న చందనోత్సవం నిర్వహణకు ఆలయ అర్చకులు ముహూర్తం నిర్ణయించారన్నారు. ఇప్పటి వరకు ఇక్కడ చందనోత్సవం జరగలేదన్నారు. ఈ ఏడాది నుంచి శ్రీకారం చుడుతున్నామన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు తాలాడ పద్మనాభం, సుంకర నారాయణరావు, కంటుబోతు ఎర్నాయుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మొకర అప్పలనాయుడు, నాయకులు బోని సన్యాసినాయుడు, బొలె అప్పలనాయుడు, రామసింగు ముత్యాలనాయుడు, తాలాడ నరసింహనాయుడు, ఆలయ ప్రధాన అర్చకుడు పి.సీతారామాంజనేయస్వామి పాల్గొన్నారు.

నూకాలమ్మ ఉత్సవాలు ప్రారంభం



బీచ్‌లో ఏర్పాటు చేసిన వినోద సాధనాలు

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ రోజు తొలేళ్ల ఉత్సవం సందర్భంగా రాత్రి గంట స్థంభం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తారు. అనంతరం బళ్లవేషాలు, సాముగరిడీలు, నేలవేషాలు, పులివేషాల ప్రదర్శనలుంటాయి. మంగళవారం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. 23 వరకు ఉత్సవాలు జరగనుండగా బీచ్ వద్ద జెయింట్ వీల్‌తోపాటు పలు రకాల వినోద సాధనాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేస్తారు. పోలీసులు వాహనాల పార్కింగ్ సదుపాయాలు కల్పించడంతోపాటు ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మూడు రోజులపాటు పెద్దబజారు, ఎగువపేట, చిన్నబజారు ప్రాంతాల్లోని వేదికల వద్ద నాటకాలు, ఆర్కెస్ట్రాలతోపాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అయితే సోమవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తుండడంతో కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుందని భక్తులు ఆందోళన చెందుతున్నారు.

వెనక్కి వెళ్లిన సముద్రం



అలలు వెనక్కి వెళ్లిపోవడంతో కనిపిస్తున్న బండరాళ్లు

భీమునిపట్నం: భీమిలి తీరంలో సోమవారం అలలు బాగా వెనక్కి వెళ్లిపోయాయి. సంవత్సరంలో కొన్నిసార్లు ఇలా సముద్రం వెనక్కి వెళ్తుంటుందని స్థానికులు చెబుతున్నారు. ఒక్కోసారి ఆటుపోట్ల సమయాల్లో ఇలా జరగ్గా, వాతావరణంలో మార్పుల వల్ల కూడా కొన్నిసార్లు జరుగుతుంది. ఈ సారి గతంలోకన్నా మరింత ఎక్కువ అలలు వెనక్కెళ్లిపోయాయి. దీంతో తీరంలో అతికొద్ది దూరంలోనే ఉండే పెద్ద, పెద్ద బండరాళ్లు కనిపిస్తున్నాయి. అలలు ఉన్నప్పుడు ఇవి కనిపించకపోవడంతో చాలా మంది స్నానాలకు దిగి అలల తీవ్రత వల్ల ఈ బండరాళ్లకు కొట్టుకుని చనిపోతున్నారు. అందువల్లే ఇక్కడి తీరంలో స్నానాలు చేయడం అత్యంత ప్రమాదకరంగా ఉంటుంది. ప్రస్తుతం అలల తీవ్రత లేకపోవడంతో చాలా మంది సందర్శకులు ఇక్కడ ఫొటోలు తీసుకోవడంతోపాటు చాలాసేపు సరదాగా గడిపారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



తెలుగు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పద్మనాభం: షడ్రుచుల ప్రసాదం ఉగాది పచ్చడి అని జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు అన్నారు. ద్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను రెడ్డిపల్లిలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు పండగ విశిష్టతను ఉగాది చాటిచెబుతుందన్నారు. ఈ సందర్భంగా క్యాలెండర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మొకర అప్పలనాయుడు, కె.త్రినాథరావు, బొడ్డు పైడన్న పాల్గొన్నారు.

కాలువల నిర్మాణానికి చర్యలు



రోడ్డుపై మురుగునీరు పరిశీలిస్తున్న అధికారులు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెంలో కాలువలు లేక రోడ్డుపై నిలిచిపోతున్న మురుగునీటిని అధికారులు సోమవారం పరిశీలించారు. గ్రామంలో కాలువలు లేకపోవడంతో నీరు సిమెంటు రోడ్డుపై నిలిచిపోతోందని, కాలువలు నిర్మించాలని వార్డు మెంబర్ మహంతి అప్పలరమణ కలెక్టర్‌కు ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి పరిశీలించారు. కాలువలు నిర్మించడానికి నిర్ణయించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు పల్లి మహేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సౌమ్య పరిశీలించారు.

పిచ్చుకల సంతతి పెంపునకు కృషి



అడవులు, పిచ్చుకల బొమ్మలతో విద్యార్థులు



తయారు చేసిన పిచ్చికగూళ్లతో విద్యార్థులు

ఆనందపురం : అంతరించిపోతున్న పక్షుల జాతిలోకి చేరిపోయిన పిచ్చుకల సంతతిని పెంపొందించడానికి అందరూ కృషి చేయాలని గిడిజాల ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎల్ఎస్ఎన్ పాత్రుడు సూచించారు. ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఇతోధికంగా సాయపడే పిచ్చుకల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సామాజిక కారణాలతో పర్యావరణంలో విపరీతమైన మార్పులు చోటు చేసుకోవడంతో పిచ్చుకల గూళ్లు ఎక్కడా కానరావడం లేదన్నారు. ఈ దృష్ట్యా వాటి సంతతిని పరిరక్షించాలంటే ఆవాస గూళ్లు, ఆహారం కోసం మట్టిపాత్రలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వాటిలో చిరుధాన్యాలు, నీటిని ఏర్పాటు చేస్తే పిచ్చుకల మనుగడ కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎల్.విజయ్ కుమారి, ఎస్వీ రామారావు విద్యార్థులచే కృత్రిమ పిచ్చుక గూళ్లను తయారు చేయించారు. వాటిని తమ ఇళ్ల వద్ద ఉంచి పిచ్చుకలను సంరక్షించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, చిత్ర లేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

ఘనంగా పిచ్చుకల దినోత్సవం

పద్మనాభం: మండలంలోని మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రపంచ అటవీ, పిచ్చుకల దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడవులు, పిచ్చుకల ఆవశ్యకతపై విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

'స్పందన'కు 6 అర్జీలు



సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న అర్జీదారుడు

మధురవాడ: ఎండాడ జీవీకే ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ నుంచి పవన్ అపార్ట్‌మెంట్ వరకు అధ్వానంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని న్యూ వివేకానంద నగర్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎస్.సూర్యనారాయణ తదితరులు కోరారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో జెడ్సీ కె.కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనలో వారు పలు సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జోన్‌లోని సమస్యలపై 6 ఫిర్యాదులు అందాయి. జాతీయ రహదారిపై ఎండాడ సమీపంలో ఉన్న బస్టాప్ పై రేకులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, మరమ్మతులు చేపట్టాలని కోరారు. పెట్రోలు బంక్ వద్ద ఏపీఎస్ఆర్టీసీ బస్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. చంద్రంపాలెంలో నివాసాల మధ్య ఉన్న టింబర్ డిపో, వాహనాల షోరూమ్‌ను వేరేచోటుకి తరలించాలని బి.అజయ్ తదితరులు కోరారు. స్పందన అర్జీలపై తక్షణమే చర్యలు చేపడతామని జెడ్సీ కనక మహాలక్ష్మి హామీ ఇచ్చారు.

పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

తగరపువలస: పీడబ్ల్యూఏ ఓల్డ్ భీమునిపట్నం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 2023 - 24 సంవత్సరానికి నూతన కార్యవర్గం ఎన్నికయింది. అడ్వయిజరీ బోర్డులో ఉన్న పాస్టర్లు పి.ఎస్.శ్యామ్‌బాబు, తిమోతీ బాబీ, సువర్ణరాజు, ఇషాక్ ఆధ్వర్యంలో వెల్లంకి మై హోప్ చర్చిలో సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా డి.విక్టర్ డేవిడ్, కార్యదర్శిగా స్టీవెన్ రాజు, కోశాధికారిగా జి.జాన్, వైస్ ప్రెసిడెంట్‌గా వినీత్ బోయాజ్, సహాయ కార్యదర్శిగా కె.తిమోతీ, సహాయ కోశాధకారిగా సీహెచ్.తిమోతీ నియమితులయ్యారు.

వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు



ఆధార్ సేవలు అందిస్తున్న కార్యదర్శి శంకర్

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ - 2 పరిధిలోని 9 వార్డుల్లో మధురవాడ, సాగర్‌నగర్, ఆరిలోవ తదితర ప్రాంతాల్లోని 11 వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు అందిస్తున్నామని, అంతా సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఇక్కడ బయోమెట్రిక్, ఆధార్ అప్‌డేట్, మార్పులు, మొబైల్ నంబర్ యాడింగ్ వంటి సేవలు అందిస్తున్నారు. సచివాలయాల పని వేళల్లో ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సచివాలయం	ఇన్‌చార్జి కార్యదర్శి	ఫోన్ నంబర్
శివశంకర్ నగర్	వి.లక్ష్మి	95739 53412
గాంధీనగర్ – 01	జి.దుర్గ	80748 65668
ఆరిలోవ – 05	ఏవీఆర్.ప్రశాంతి	99852 01964
బాలాజీనగర్ – 03	షేక్ ఇబ్రహీమ్	89191 75192
ఎమ్ఎస్ఆర్ లే అవుట్	కె.భానుప్రసాద్	85002 63037
సంజయ్‌గాంధీ కాలనీ	పి.శ్రీనివాస్	99599 19115
వైఎస్సార్ నగర్ – 01	కౌండిన్య	90305 30039
స్వతంత్రనగర్ – 01	కె.శంకర్	91821 43542
రుషికొండ – 01	డి.శ్రీను	99858 52054

చిట్టివలస పేరును కనుమరుగు కానీయవద్దు



బొగ్గురోడ్డు సచివాలయంలో వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

తగరపువలస: పారిశ్రామిక ప్రాంతంగా, రాజాపులోవ - రాయ్‌పూర్ జాతీయ రహదారిలో ఎంతగానో గుర్తింపు, ప్రాముఖ్యత చిట్టివలస కలిగి ఉందని ఆ గ్రామ పరిరక్షణ సమితి ప్రతినిధి బల్ల వెంకటరావు అన్నారు. ఈ మేరకు బొగ్గరోడ్డు సచివాలయంలో చిట్టివలస పేరు కనుమరుగు కానివ్వవద్దని కోరుతూ సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ 1974లో మేజర్ పంచాయితీ అయిన చిట్టివలసలో కొన్ని శతాబ్దాల క్రితమే యూరోపియన్లు నీలిమందు పరిశ్రమ స్థాపించారన్నారు. దేశంలోనే రెండో పెద్ద జ్యూట్ పరిశ్రమ ఇక్కడ ఉండేదన్నారు. పలు బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చిట్టివలస అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించిందన్నారు. అయినప్పటికీ తగరపువలస ముసుగులో చిట్టివలస వెనుకబడిపోయిందన్నారు. ఆర్టీసీ బస్సులు, పలు విద్యాసంస్థలు ఇప్పటికీ చిట్టివలసను విస్మరించి తగరపువలస పేరునే ప్రస్తావిస్తున్నాయన్నారు. తగరపువలస కంటే ముందంజలో ఉన్న చిట్టివలసను ప్రభుత్వం గుర్తించాలని ఈ వినతిపత్రంలో కోరారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9666125299, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమిలి
9912220753
Office mail : sakshiadvtvsp@gmail.com